సాక్షి ఒడిశా

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,01,913
బంగారం	4 గ్రాముల 720 మిల్లీ గ్రాములు
వెండి	21 గ్రాముల 800 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి



రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ప్రభుత్వ ఉన్నత ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి తీవ్ర అస్వస్థతతో శుక్రవారం మృతి చెందాడు.

- 8లో



సన్ డే..!

గజపతి జిల్లాలో ఎండలకు ప్రజలు పగటిపూట ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి స్మృతి రంజన్ ప్రధాన్ ఆదివారం పరిశీలించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు, ఫ్యాన్లు, ఏసీల పనితీరు పర్యవేక్షించారు. ఉదయం పూట కరెంటు కోతలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పాటు భువనేశ్వర్ నుంచి విచ్చేసిన ఎన్నికల అధికారి, తహసీల్దార్ నారాయణ బెహరా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

25న హోం మంత్రి అమిత్ షా పర్యటన



భువనేశ్వర్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈనెల 25న రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. పశ్చిమ ఒడిశా సువర్ణపూర్ జిల్లా సోన్‌పూర్ పట్టణానికి రానున్నట్లు బీజేపీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి గోలక్ మహాపాత్ర ఆదివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు 2024 కోసం పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా ఆరోజు మధ్యాహ్నం సోన్‌పూర్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం భువనేశ్వర్‌కు చేరుకుని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులతో చర్చలో పాల్గొంటారు. అనంతరం రాత్రి భువనేశ్వర్‌లో బస చేసి మరుసటి రోజు ఉదయం తిరిగి వెళ్తారు. సోన్‌పూర్ బొలంగీర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. బర్‌గడ్, సుందర్‌గడ్, కంధమల్, అస్కాతో పాటు ఈ స్థానంలో మే 20న ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు నామినేషన్లు ఏప్రిల్ 26న ప్రారంభమవుతాయి.

25 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వడగాలుల పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలకు ఈనెల 25 నుంచి వేసవి సెలవులను ఆదివారం ప్రకటించింది. భారత వాతావరణ శాఖ వాతావరణ సూచనల దృష్ట్యా సోమవారం నుంచి వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈనెల 22 నుంచి 24 వరకు ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఈనెల 25 (గురువారం) నుండి వేసవి సెలవుల కోసం మూసివేయబడతాయని ప్రకటించారు. ఉపాధ్యాయుల బోధనా కార్యకలాపాలన్నీ సెలవు కాలంలో ప్రాథమిక విద్యా సంచాలకులు, మాధ్యమిక విద్యా సంచాలకులు, ఉన్నత విద్యా సంచాలకుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వడగాలుల పరిస్థితుల దృష్ట్యా ఏప్రిల్ 18 నుంచి 20 వరకు 3 రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు తాత్కాలికంగా సెలవులు ప్రకటించి మూసివేసిన విషయం తెలిసిందే.

'శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి'



క్రైమ్ సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరగాలని డీజీపీ అరుణ్ కుమార్ సడంగి స్పష్టం చేశారు. స్థానిక డీఐజీ కార్యాలయ సమావేశ మందిరంలో దక్షిణాంచల్ రేంజ్ స్థాయిలో క్రైమ్ సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. తప్పించుకొని తిరుగుతున్న నేరస్తులపై వెంటనే అరెస్టు వారంట్ జారీచేసి అరెస్టు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్న నేరస్తుల సమాచారం సేకరించాలన్నారు. పోలీసుస్టేషన్లలో నమోదవుతున్న కేసులపై నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో బరంపురం ఎస్పీ సర్థక్ సడంగి, గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన తదితరులు పాల్గొన్నారు.

చెరిగిపోని సిరా కథ..!

- ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్క
- భారతీయ ఎన్నికల చిరకాల చిహ్నం
- ప్రస్తుత ఎన్నికలకు సరిపడా సిరా సిద్ధం



భువనేశ్వర్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగపరంగా అతి పెద్ద పండగ ఎన్నికలు. దేశ దశ, దిశ నిర్దేశనకు ఇదో బృహత్తర కార్యక్రమం. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన భారీ ప్రక్రియ. అటువంటి ఎన్నికలో చెదిరిపోని జ్ఞాపకం చెరగని సిరా. ఇది ఎన్నికల సిరాగా ప్రతీతి. ఓటు వేసిన ప్రతి పౌరుని చూపుడు వేలుపై ఈ సిరా బొట్టు ఓ మురిపెం. ఓటు వేసిన కొన్ని రోజుల వరకు వేలిపై చెరగని జ్ఞాపకంగా నిలిచిపోతుంది.

అక్రమాలకు అడ్డుకట్ట

పోలింగ్ ప్రక్రియలో అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలకు ఈ సిరా కళ్లెం వేస్తుంది. దీని వినియోగంతో పౌరుడు ఒకే ఒక్కసారి ఓటు వేయగలుగుతాడు. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఓటు వేయకుండా నిరోధించే పద్ధతిగా భారతదేశంలో చెరగని ఎన్నికల సిరా కనుగొనబడింది. ఇప్పుడు ఈ సిరాని దాదాపు 25 దేశాలు ఎన్నికల నిర్వహణలో ఉపయోగిస్తున్నాయి. దేశంలో ప్రారంభమైన తాజా సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని సరిపడా చెరగని సిరా సీసాలను సిద్ధం చేశారు.

భారత ఎన్నికల సిరా చట్టబద్ధం

1951 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ) సిరా గురించి ప్రస్తావించింది. చెరగని సిరాను తొలిసారిగా వైజ్ఞానిక మరియు పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్‌ఐఆర్) ఉత్పత్తి చేసింది. దీనిపై న్యూఢిల్లీ జాతీయ పరిశోధన అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌ఆర్‌డీసీ) పేటెంట్ హక్కులు పొందింది. మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ సిరా తయారీకి లైసెన్స్ పొందింది. ఇది కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ. 1962 నుంచి ఈ సంస్థ ఎన్నికల సిరాని విక్రయిస్తుంది. ఈ సంస్థ భారతదేశంలో చెరగని (ఎన్నికల) సిరా ఏకైక తయారీదారుగా కొనసాగుతోంది.

మౌలిక అంశాలు గోప్యం

ఈ చెరగని ఇంక్‌లో ఆల్కహాల్ వంటి ద్రావకం కూడా ఉంటుంది. ఈ సిరా తయారీకి సంబంధించిన ఖచ్చితమైన విధి విధానం ప్రక్రియ, రసాయన కూర్పు, వివిధ అంశాల పరిమాణం వంటి విషయాలు పూర్తిగా గోప్యం. వీటి కోసం ప్రజలకు ఏ వివరం తెలిసే అవకాశం లేదు.

విదేశాలకు ఎగుమతి

కెనడా, ఘనా, నైజీరియా, మంగోలియా, మలేషియా, నేపాల్, దక్షిణాఫ్రికా, మాల్దీవులు వంటి 25 కంటే ఎక్కువ విదేశాలకు చెరగని ఎన్నికల సిరా ఎగుమతి చేయబడుతోంది.

సిరా తయారీ ఇలా

చెరగని సిరాలో సిల్వర్ నైట్రేట్ ఉంటుంది. సిల్వర్ నైట్రేట్ అనేది రంగులేని (వర్ణ విహీన) సమ్మేళనం. ఇది సూర్యకాంతితో సహా అతినీలలోహిత కాంతికి గురైనప్పుడు తళుక్కుమంటుంది. సిల్వర్ నైట్రేట్ మోతాదు అధికంగా ఉంటే ఎన్నికల సిరా నాణ్యత ఎక్కువగా ఉంటుంది. ఓటు వేసిన ప్రతి పౌరుని చూపుడు వేలుపై దీనితో బొట్టు పెడతారు. ఈ బొట్టు 72 గంటల వరకు చెక్కు చెదరకుండా ఉంటుంది. ఇది సబ్బు, ఇతర తేర ద్రవాలు, ఇంటిని శుభ్రపరిచే, బట్టలు ఉతికే డిటర్జెంట్లు మొదలైన వాటి తాకిడితో తొలగిపోకుండా సుమారు 3 రోజులపాటు వేలిపై తళతళలాడుతుంటుంది.

ఓటే వజ్రాయుధం



ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ



మే 25న ఓటు వేద్దాం నినాదంతో నూతన ఓటర్లు



వాక్‌థాన్‌లో పాల్గొన్న నూతన ఓటర్లు

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు ప్రత్యక్ష భాగస్వామ్యానికి ప్రతీక ఓటు. రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కుని సద్వినియోగపరిచే దిశలో చైతన్య కార్యక్రమాలు చేడుతున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో నగరంలో నిర్వహించిన వాక్‌థాన్ కార్యక్రమంలో నూతన ఓటర్లు అత్యంత ఉత్సాహంగా పాలు పంచుకోవడం విశేషం. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సీఈవో నికుంజ బిహారీ ధొలా, భువనేశ్వర్ కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్ సంజీబ్ పండా, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాజేష్ ప్రభాకర్ పాటిల్, అదనపు ఎన్నికల ప్రధాన అధికారి డాక్టర్ తిరుమల నాయక్, ఖుర్దా జిల్లా మేజిస్ట్రేట్ చంచల్ రాణా మరియు ఇతర అధికారులు, నూతన యువ ఓటర్లు, వయో వృద్ధ ఓటర్లు, మార్కెట్ అసోసియేషన్లు, సంగీత మహావిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండబాబుపై వేటు

- ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేసిన అధిష్ఠానం



కొండబాబు



బినాయక్ పొల్లాయ్

రాయగడ: బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల వేంకటేశ్వరరావు అలియాస్ కొండబాబుపై ఆ పార్టీ వేటు వేసింది. ఆయన ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేసి పార్టీ నుంచి బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నందుకు ఈ మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. బీజేడీ రాష్ట్ర శాఖ సీనియర్ జనరల్ సెక్రటరీ, జిల్లా ఎన్నికల పరిశీలకుడు అతున్ సవ్యసాచి నాయక్ ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం కొండబాబు అసంతృప్తి వర్గంగా ఏర్పడి వేరు కుంపటి పెట్టారు. అనంతరం స్థానిక రింగ్ రోడ్డులో బీజేడీ కార్యకర్తల కార్యాలయాన్ని ప్రారంభించి తన కార్యకలాపాలను నిర్వహిస్తుండేవారు. అధిష్ఠానం ఆదేశాలు లేకుండా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను చేపడుతున్నట్లు గుర్తించిన అధిష్ఠానం ఈ మేరకు చర్యలు తీసుకుంది. ఇదిలాఉండగా బిజు ఛత్ర జనతాదళ్ రాష్ట్ర శాఖ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బినాయ్ పొల్లాయ్‌ను కూడా అధిష్ఠానం పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

రైతులకు అధికారులు అండగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

- రాయగడ కలెక్టర్ మహాజన్



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు సంబంధిత శాఖ అధికారులు అండగా ఉండాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులతో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఆయా ఇబ్బందుల నుంచి గట్టెక్కించేవిధంగా అధికారులు చర్యలు తీసుకొని, తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. టార్పలిన్లు, తాగునీటి సౌకర్యం తదితర సౌకర్యాలను కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 8 మండీలు ప్రారంభించేందుకు తీర్మానించారు. మండీల్లోనే ధాన్యం విక్రయించేలా రైతులను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంసీ చైర్మన్ కల్యాణి సంఘమిత్రా దేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి దాశరథి సారేన్, ల్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన అవసరం



యోగా చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా అవసరమని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కోరాడ రజిత అన్నారు. ప్రతిరోజూ నిర్దిష్ట సమయంలో యోగాసనాలు వేయడం వల్ల జీవితంలో ఎంతో ఉత్సాహంగా ఉంటారన్నారు. అందువల్ల తమ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ్ పహాడ్ వద్ద ఈ తరహా చైతన్య కార్యక్రమాలను నిర్వహించామని తెలియజేశారు. అనంతరం క్లబ్ సభ్యులు సామూహిక నడక, యోగా కార్యక్రమాలను చేపట్టారు. స్థానికంగా ఉన్న వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రచార హోరు..!



బరంపురం: చికిటీలో ప్రచారం నిర్వహిస్తున్న చిన్మయనంద్ శ్రీరూప్ దేవ్ తదితరులు



బరంపురం: జోరుగా ప్రచారం చేస్తున్న మంత్రి ఉషాదేవి

ప్రచార పర్వం

జయపురం: నవరంగపూర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధి జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థులు ఆదివారం ప్రచారం ప్రారంభించారు. కోట్‌పాడ్ నియోజకవర్గంలో అంతర్భాగమైన బొరిగుమ్మ సమితి శౌశాహండి పంచాయతీలో నవరంగపూర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బలభద్ర మఝి, కోట్‌పాడ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రుపు భొత్రలు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా గ్రామంలోని శ్రీజగన్నాథ మందిరంలో పూజలు నిర్వహించారు. అనంతరం మందిరం నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. నువాగాం, డబాగాం, ఝిలిమిలయగుడ, జానీగుడ, కుందుగుడ, కొణాగాం, నందరాల, మలద గ్రామాల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. బీజేపీతోనే దేశం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. దేశం ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే బీజేపీ గెలవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలోకి వస్తే కోట్‌పాడ్ నియోజకవర్గాన్ని ఉన్నతంగా అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

బరంపురం: పోలింగ్ సమయం సమీపిస్తుండడంతో బరంపురం నియోజకవర్గం బీజేడీ ఎంపీ అభ్యర్థి బిగుభక్తి పాత్రో, ఎమ్మెల్యే అభ్యర్థి డా.రమేష్ చంద్రచావ్ పట్నాయక్ చురుకుగా ప్రచారంలో పాల్గొంటున్నాయి. మరోవైపు బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.అనిల్ కుమార్ సైతం ప్రచారంలో దూసుకుపోతున్నారు. అదేవిధంగా చికిటీ నియోజకవర్గం నుంచి మంత్రి ఉషాదేవి కుమారుడు చిన్మయనంద్ శ్రీరూప్ దేవ్ ప్రచారం హోరెత్తిస్తున్నారు.



జయపురం: శౌశాహండిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

పరిమితికి మించి ఖర్చు చేస్తే చర్యలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- గంజాం కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘించి పరిమితికి మించి ఖర్చు చేస్తే చర్యలు తప్పవని ఎన్నికల అధికారి, కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా స్పష్టం చేశారు. గంజాం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఉన్నత అధికారులతో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మే 13వ తేదీన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అతిక్రమించే అభ్యర్థులపై ఏవిధంగా చర్యలు తీసుకోవాలో స్క్వాడ్ టీమ్‌కి శిక్షణ ఇచ్చారు.

క్లుప్తంగా

త్వరలో నాన్నతో సినిమా



హీరో ఆకాష్ పూరీకి జ్ఞాపికను అందజేస్తున్న మండవిల్లి రవి

అరసవల్లి: తన తండ్రి పూరి జగన్నాథ్ దర్శకత్వంలో త్వరలోనే మంచి యాక్షన్ సినిమా చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వర్ధమాన హీరో ఆకాష్ పూరి ప్రకటించారు. ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి సాదరంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆకాష్ మాట్లాడుతూ నాన్నతో సినిమా అంటే అది ఎప్పటికీ ప్రత్యేకంగా ఉండేలా కష్టపడతానని, ప్రస్తుతం ఓ లవ్ యాక్షన్ సినిమా షూటింగ్ నడుస్తుందని వివరించారు. అరసవల్లిలో అరుణహోమం, సౌర హోమాన్ని కూడా చేయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

బెల్లం ఊటలు ధ్వంసం

నందిగాం: మండలంలోని హర్షబడ పంచాయతీ వెంకటాపురంలో బెల్లం ఊటలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది ధ్వంసం చేశారు. ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్ గంగాధరం ఆదేశాల మేరకు టెక్కలి ఎస్‌ఈబీ సీఐ రాజశేఖరనాయుడు, పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు చేసి 1100 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు.

ఏకగ్రీవంగా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నికలు



ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న హనుమంతు సాయిరాం

శ్రీకాకుళం అర్బన్: ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం శ్రీకాకుళం ఏపీ ఎన్‌జీవో సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, సెక్రటరీ సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వేణుగోపాల్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా కె.మోహనరావు వ్యవహరించారు. నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వై.శ్రీనువాసరావు, పైల శంకర్ తదితరులు హాజరయ్యారు.

కార్యవర్గమిదే..

సంఘం అధ్యక్షునిగా సీహెచ్ ఉమాశంకర్, కార్యదర్శిగా ఎ.తారకేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షునిగా ఎం.లక్ష్మణరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

బైక్ బోల్తాపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిరమండలం: మండలంలోని భగిరథీపురం-బొంతు రహదారి కోదూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సారువకోట మండలం దాసుపురం గ్రామానికి చెందిన సిద్దమడుగుల శంకరరావు(26)అద్దాలు ఫిటింగ్ పనిచేస్తూ సాగిస్తున్నాడు. రెండున్నరేళ్ల కిందట హిరమండలం మండలం చవితిసీదికి చెందిన ఆశాతో వివాహం జరిగింది. ప్రస్తుతం గర్భిణి కావడంతో కన్నవారింట ఉంటోంది. శనివారం సాయంత్రం శంకరరావు పని ముగించుకుని కోదూరులోని అక్క ఇంటికి బైక్‌పై వెళ్లారు. భోజనం చేశాక అర్ధరాత్రి సమయంలో అత్తవారింటికి బయలుదేరాడు. కోదూరు నుంచి కిలోమీటర్ దూరం వెళ్లేసరికి బైక్ అదుపు తప్పడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. భార్య ఆశా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కాశీబుగ్గ: మందస మండలం కొత్త కమలాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. కవిటి మండలం దూగానపుట్టుగ గ్రామానికి చెందిన బల్ల జోగారావు(52)తన బంధువులు శేషమ్మ, జశ్వంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వజ్రపుకొత్తూరు మండలం ధర్మపురం ఓ భోజన కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జోగారావు తల నుజ్జవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శేషమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. జశ్వంత్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధిత మహిళను చికిత్స నిమిత్తం హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చండీహోమం ప్రారంభం



చండీ హోమం పూజల్లో ఆలయ ట్రస్ట్ సభ్యులు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

- కొనసాగుతున్న మజ్జిగౌరి చైత్రోత్సవాలు

రాయగడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి చండీహోమం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విశ్వశాంతి కోసం ప్రతీ ఏడాది ఈ హోమాన్ని నిర్వహిస్తున్నారు. ముందుగా సూర్యపూజ నిర్వహించిన పురోహితులు అనంతరం చండీహోమ ప్రక్రియను చేపట్టారు. ఆలయ ట్రస్టీ రాయిసింగి బిడిక, ట్రస్ట్ సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, వి.శ్రీనివాస్‌రావు, పెద్దీన వాసు దంపతులు ఈ పూజల్లో కూర్చున్నారు. మంగళవారం వరకు హోమం కొనసాగుతుంది.

సేవా కార్యక్రమాలు

అమ్మవారి చైత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానికంగా ఉన్నటువంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయ ప్రాంగణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాయి. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మజ్జిగ వితరణ చేపట్టారు. అదేవిధంగా ఆలయం తరుపున అన్న ప్రసాద సేవన కార్యక్రమం కొనసాగుతోంది.

భక్తుల మొక్కుబడులు

తమకు అంతా శుభం జరగాలని కోరుతూ అమ్మవారిని మొక్కుకున్న భక్తులు ఈ ఉత్సవాల్లో తమ మొక్కుబడులను తీర్చుకుంటున్నారు. అమ్మవారికి ఇష్టమైన నెయ్యిలతో రూపొందించిన అమ్మవారి ఆకారానికి భక్తి శ్రద్ధలతో పూజించిన అనంతరం దానిని తిరిగి అమ్మవారి సన్నిధికి చేర్చుతున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ వాయిద్యాలతో భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకుంటుండడం విశేషం.



మజ్జిగ వితరణ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు

మల్కన్‌గిరిలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న జవాన్లు



మల్కన్‌గిరి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎస్పీ నితీష్ వాద్వానీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు, బీఎస్‌ఎఫ్, డీవీఎఫ్, డీఆర్‌జీ సాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ ఆదివారం నిర్వహించారు. ప్రజలకు భద్రతపై విశ్వాసం కల్పించడం కోసమే ఫ్లాగ్‌మార్చ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలకు రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎస్డీపీవో సైస్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి



సుమన్ నాయక్ (ఫైల్)



టికిరి ఆశ్రమ పాఠశాల

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఎస్సీ, ఎస్టీ విభాగం పరిధిలోని ప్రభుత్వ ఉన్నత ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి తీవ్ర అస్వస్థతతో శుక్రవారం మృతి చెందాడు. విద్యార్థి సమితిలో డొంగాశిలి పంచాయతీలోని తుజేర్ గ్రామానికి చెందిన సుశాంత్ నాయక్ కుమారుడు సుమన్ నాయక్ (15)గా గుర్తించారు. ఆశ్రమ పాఠశాలల్లో తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవాలను తెలుసుకునేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమర్ నాయక్, జిల్లా సంక్షేమశాఖ అధికారి భరత్ భూషన్ బిశ్వాల్, కాసీపూర్ సమితి విద్యాశాఖ అధికారి దీప్తీమయి సింహ్ తదితరులు శనివారం ఆశ్రమ పాఠశాలకు వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

ఇదీ విషయం..!

ఆశ్రమ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న సుమన్ ఈనెల 18వ తేదీన తీవ్ర జ్వరంలో బాధపడ్డాడు. దీంతో నిర్వాహకులు సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.



పాఠశాలలో దర్యాప్తు చేస్తున్న అధికారులు

కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమన్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం టికిరిలోని ఉషాపాడు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అయితే ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే సుమన్ మృతి చెందాడని విద్యార్థి తండ్రి సుశాంత్ నాయక్ ఆరోపించాడు. దీనిని పరిగణలోకి తీసుకున్న అధికారులు శనివారం దర్యాప్తు చేపట్టారు. ఒకవేళ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన చోటుచేసుకుంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని విద్యాశాఖ అధికారి నాయక్ తెలియజేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



పోలీసులకు పట్టుబడిన నిందితుడు

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసులు చోరీ కేసుకు సంబంధించి ఒక నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి పద్మపూర్‌కు చెందిన పులక పవిత్ర (22)గా పోలీసులు గుర్తించారు. అతని వద్ద నుంచి రూ.1.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి చందిలి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ముకుందపూర్‌లో లక్ష్మణ బెహర అనే వ్యక్తి జన సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. ఈనెల 17వ తేదీన తన కేంద్రంలో దొంగతనం జరిగిందని చందిలి పోలీస్‌స్టేషన్‌లో 18వ తేదీన ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు నిర్వహించి నిందితుడు పులక పవిత్రను పట్టుకున్నారు.

సదాశివ త్రిపాఠి సేవలు చిరస్మరణీయం



త్రిపాఠి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘమిత్రాదేవి

రాయగడ: స్వాతంత్య్ర సమరయోధుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ సదాశివ త్రిపాఠి రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి అన్నారు. త్రిపాఠి జయంతి సందర్భంగా స్థానిక సాంస్కృతిక భవనంలో జిల్లా యంత్రాంగం ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, త్యాగశీలిగా, అవినీతిరహితుడిగా పేరొందిన త్రిపాఠి ఆదర్శప్రాయుడని కొనియాడారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి. జలంధర్ పుసిక, జిల్లా క్రీడా శాఖ అధికారి షేక్ ఆలీనూర్ తదితరులు హాజరయ్యారు.

బీజేపీలోకి భారీగా వలసలు



బీజేపీలో చేరిన రెండు సమితుల కార్యకర్తలు



బీజేపీలో చేరిన మహేష్ బక్క తదితరులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి, ఖోయిర్‌పుట్ సమితి అధ్యక్షులతో పాటు బీజేడీ పార్టీకి చెందిన సర్పంచ్‌లు, కార్యకర్తలు సుమారు 500 మంది బీజేపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా మత్తిలి సమితి అధ్యక్షుడు మహేష్ కుమార్ బక్క మాట్లాడుతూ బీజేడీలో తమకు అన్యాయం జరిగిందన్నారు. పూర్ణచంద్ర బక్కకు టిక్కెట్టు కేటాయించకపోవడంతో బీజేడీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు మత్తిలి కల్యాణ్ మండపం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డొంబురు శిసా, బీజేపీ అధ్యక్షుడు నిమయ్ చంద్రపాల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే ఆదిత్యా మాడిల ఆధ్వర్యంలో వీరంతా బీజేపీలో చేరారు.

సన్ డే..!



నిర్మానుష్యంగా మారిన హైస్కూల్ జంక్షన్



మహేంద్రతనయ నదిలో అడుగంటిన నీరు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఎండలకు ప్రజలు పగటిపూట ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం పగటి పూట 40 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. వేకువజామున మంచు కురుస్తూ, ఉదయం ఏడు గంటల నుంచి విపరీతమైన ఎండ కాస్తున్నది. ఉదయం పదకొండు గంటలకే పర్లాకిమిడిలో హైస్కూల్ జంక్షన్ నిర్మానుష్యంగా మారింది. మల్కన్‌గిరి, రాయగడ, గంజాం జిల్లాలో అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. కానీ పర్లాకిమిడిలో వడగాల్పులు వల్ల ఏజెన్సీ ప్రాంతాలైన గుమ్మా, రాయఘడ నుంచి ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. ఇలాగే కొనసాగితే పర్లాకిమిడిలో నీటి ఎద్దడి తప్పేలా లేదు. మహేంద్రతనయ నదిలో నీరు అడుగంటింది.

యువకుడికి తీవ్ర గాయాలు

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టికి చెందిన రాయల జగదీష్ అనే యువకుడిపై కర్రకోత మిషన్ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. జగదీష్ ఇంటి వద్దే కార్పెంటర్ పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం అత్యవసర పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కర్రలు కోసే మిషన్ తగిలింది. మెడకు తీవ్ర గాయం కావడంతో తల్లిదండ్రులు 108 ద్వారా టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

విశాఖ-బీ కాలనీలో 7 తులాల బంగారం చోరీ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని విశాఖ-బీ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో శనివారం అర్ధరాత్రి తర్వాత ఏడు తులాల బంగారం చోరీ జరిగిందని రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. గుడ్ల శేషగిరిరావు తన భార్యతో కలిసి విశాఖ-బి కాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కాగా వివాహం జరిగి అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. వేసవి కావడంతో అపార్ట్‌మెంట్ పైన టెంట్ హౌస్‌లో కొద్ది రోజులుగా నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలోని లాకర్‌లో భద్రపరిచిన 7 తులాల బంగారు ఆభరణాలు పట్టుకుపోయారని శేషగిరిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు, క్లూస్‌టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఘనంగా మహవీర్ జయంతి



ఊరేగింపులో పాల్గొన్న జైన సాంప్రదాయ ప్రజలు

జయపురం: పట్టణంలోని జైన్ సాంప్రదాయ ప్రజలు మహవీర్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మైన్ రోడ్డులో జైన్ మందిరం నుంచి నాలుగు అశ్వాల అందమైన రథంపై నిలువెత్తు మహావీర చిత్రపటాన్ని ఊరేగించారు. జైన్ సాంప్రదాయ పురుషులు, బాలలు జైన పతాకాలను చేతపట్టి ముందు నడవగా, రథం వెంట మహిళలు మహవీర్ జైన్ భగవానుడి మత ప్రార్థనలు పఠిస్తూ వెంట నడిచారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రథంపై మహవీర్ జైన్ చిత్రపటం ఊరేగింపు

పార్కులకు.. ఫుల్ మార్కులు



నాగావళి రివర్ వ్యూ పార్కు

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఆహ్లాదకరంగా మార్పు
- కోట్లాది రూపాయలతో శ్రీకాకుళంలో పార్కుల సుందరీకరణ
- ఆనందం వ్యక్తం చేస్తున్న నగర వాసులు

టీడీపీ పాలనలో నిరాదరణకు గురైన పార్కులు వైఎస్సార్ సీపీలో అభివృద్ధి బాటపట్టాయి. ఒకప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉండే ఈ ఉద్యానవనాలు నేడు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధులు వరకు సాయంత్రం పూట సరదాగా పార్కుకు వెళ్తూ చల్లని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ఐదేళ్లలో శ్రీకాకుళం నగరంలోని పార్కులకు రూ 2.75కోట్లు, జాతీయ రహదారిని ఆనుకున్న ఉన్న విజయాదిత్యా పార్కుకు రూ 2.54 కోట్లు కేటాయించి అందంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో మిగిలిన పార్కులకు సైతం నిధులు మంజూరు చేసి చక్కగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)



గాంధీ పార్కులో చిన్నారుల ఆట పరికరాలు



పార్కులో వ్యాయామ పరికరాలు



సుందరంగా శ్రీకాకుళంలోని గాంధీ పార్కు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర స్పోక్స్‌పర్సన్‌గా రేగాన


రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన రేగాన శ్రీనివాసరావుకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర విభాగంలో చోటు దక్కింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేగాన శ్రీనును వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా నియమిస్తూ ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనను నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం జగనన్నతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమైందన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ఎస్సీలు ఆత్మ గౌరవంతో జీవిస్తున్నారన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర పదవిని కట్టబెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన జిల్లా ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి..


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి, డాక్టర్ అజయ్


బాడంగి: మండలంలోని పిండ్రంగివలస శివారు గ్రామమైన రౌతువానివలసకు చెందిన టీడీపీ కార్యకర్తలు పలువురు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లినప్పుడు ఆయన సమక్షంలో వారు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామ సర్పంచ్ రావాడ గౌరమ్మ, భర్త తిరుపతిరావు ఆధ్వర్యంలో వీరు చేరారు. డాక్టర్ పోల అజయ్, జిల్లా జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జామిలో...


ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కుద్దుపాలెం గ్రామస్తులు

జామి: మండలంలోని అలమండ పంచాయతీ కుద్దిపాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కుద్దిపాలెం గ్రామంలో వారందరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. యలమంచిలి దేముడు, కోన సురేష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, ఉప సర్పంచ్ లగుడు దేముడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీఎస్పీ నాయకుడు


బీఎస్పీ ఎస్.కోట నియోజకవర్గం ఉపాధ్యక్షుడు చైతన్యకుమార్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: బహుజన సమాజ్‌వాది పార్టీ శృంగవరపుకోట నియోజకవర్గం ఉపాధ్యక్షుడు గాలి చైతన్యకుమార్ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. కొత్తవలస మండలం అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చైతన్యకుమార్‌కు పార్టీ కండువా వేసి కడుబండి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు మేలు జరుగుతోందని, అందుకే పార్టీలో చేరినట్టు ఆయన తెలిపారు. జామి మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం



చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాలతో ఆదివారం అభిషేకాలు చేశారు. ఉదయం 4 గంటల నుంచే పంచామృత క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించా రు. అధికమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● అలుపెరగని ప్రచారం

పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎండలు మండుతున్నా విరామమెరగకుండా ప్రజల్లోకి వెళ్తూ తమ ప్రభుత్వం హయాంలో ప్రజలకు అందజేసిన సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ఆయా నియోజకవర్గాల్లోని ప్రజలు మద్దతు పలుకుతున్నారు. స్వచ్ఛందంగా అభ్యర్థుల వెంట ప్రచారంలో వారు కూడా పాల్గొంటున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పార్టీ స్థానిక నాయకుల సహకారంతో అభ్యర్థులు అలుపెరగని ఉత్సాహంతో ప్రచారంలో మెరుస్తున్నారు.


వీరఘట్టం మండలంలోని అదారులో ర్యాలీగా వస్తూ ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిని కళావతి


పార్వతీపురం పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు


సాలూరు పట్టణంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

తీరిన గిరిజనుల 'వే'దన

- కోట్లాది రుపాయలతో రోడ్ల నిర్మాణం
- మైదాన, గిరిశిఖర గ్రామాలకు జీటీ రోడ్లు పూర్తి
- ముమ్మరంగా సాగుతున్న మరికొన్ని రోడ్ల పనులు


అటవీమార్గం గుండా వేసిన గిరిశిఖర కరాడవలస రోడ్డు


నిర్మాణం పూర్తయిన ఎస్‌హెచ్26 నుంచి కరాడవలస రోడ్డు


శిఖపరువు రోడ్డు


రొడ్డవలస రోడ్డు

సాలూరు: దేశంలో దుర్భేధ్యమైన గిరిశిఖర గ్రామాలకు రోడ్డు నిర్మాణం దాదాపు అసాధ్యమనే వాదన గత టీడీపీ పాలనలో వినిపించేది. మంచి చేయాలనే సదుద్దేశం, గిరిజనుల రహదారి కష్టాలను తొలగించాలనే చిత్తశుద్ధి ఉంటే రహదారి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులనైనా అధిగమించగలమని వైఎస్సార్‌సీపీ పాలనలో రుజువు చేసింది. ఒక్క పీఆర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలోనే సుమారు వంద కోట్ల రుపాయలతో గిరిశిఖర ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాల్లోను అనేక గ్రామాలకు రోడ్లు మంజూరు చేసి, పనులు చేపట్టింది.

గిరిశిఖర గ్రామాల రోడ్ల ప్రగతి వివరాలు

ఎస్‌హెచ్26 నుంచి కరాడవలసకు రూ.496.90 లక్షలతో 7.30 కి.మీ రోడ్డు పూర్తయింది.

- సాలూరు మండలంలోని గంజాయిభద్ర పంచాయతీ దిగువశెంబి నుంచి డిప్పలపాడు మీదుగా తోణాం గ్రామానికి రూ.620 లక్షలతో 6 కి.మీ. రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- పాచిపెంట మండలంలోని ఆజూరు నుంచి పందిరిమామిడివలసకు సుమారు రూ.224లక్షలతో 3.80 కి.మీ.రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు.
- ఇదే మండలంలో కుంతాం బీటీ రోడ్డు నుంచి తుమ్మిగుడ్డకు రూ.465 లక్షలతో 6.90 కి.మీ, నీలంవలస నుంచి గుమ్మిడిగుడకు 376.50 లక్షల రుపాయలతో 6.80 కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రారంభోత్సవం చేశారు. అలాగే వేటగానివలస నుంచి శతాబి మీదుగా అరకుకు రూ.997 లక్షలతో 14 కి.మీ. రోడ్డు నిర్మాణానికి గాను 8 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది.
- రూ.628 లక్షలతో వేటగానివలస నుంచి తంగ్లాం గ్రామానికి రోడ్డు పనులు జరుగుతున్నాయి. అలాగే రూ.618 లక్షలతో వేటగానివలస తంగ్లాం రోడ్డు నుంచి మూటకూడు గ్రామానికి రోడ్డుపనులు జరుగుతున్నాయి.
- రొడ్డవలస నుంచి కంకణాపల్లికి రూ.135 లక్షలతో ప్రారంభించిన 1.20 కి.మీ.రోడ్డు నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇంకా రూ.403 లక్షల అంచనా వ్యయంతో పాచిపెంట మండలం ఆలూరు నుంచి మోదుగకు చేపట్టిన రహదారి నిర్మాణం వివిధ దశల్లో ఉంది.
- సాలూరు మండలం నంద-పగులుచెన్నేరు నుంచి కొదమకు సుమారు రూ.1132.56 లక్షలతో 10.80 కి.మీ రోడ్డుకు 2022 ఆగస్టు 26న, ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నిశాంత్‌కుమార్ భూమి పూజ చేయగా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కా ఏర్పాట్లు

- పటిష్టంగా స్ట్రాంగ్ రూమ్‌లను రూపొందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
- లెండీ, జేఎన్‌టీయూ కళాశాలలను పరిశీలించిన కలెక్టర్


జేఎన్‌టీయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: రిసెప్షన్ సెంటర్ల వద్ద అన్ని వసతులను కల్పిస్తూ, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం ఉదయం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం, డెంకాడ మండలంలోని లెండీ ఇంజినీరింగ్ కళాశాలలను ఆమె సందర్శించారు. వాహనాల పార్కింగ్ కోసం పరిసర ప్రాంతాలను సైతం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగురూములు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లుపై సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శృంగవరపుకోట నియోజకవర్గాలు, జేఎన్‌టీయూజీవీలో బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిసెప్షన్ సెంటర్ సిబ్బందితో పాటు, పోలింగ్ అనంతరం ఈవీఎంలను తీసుకువచ్చే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది పడకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటర్లు తగినంత విశాలంగా, పూర్తి లైటింగ్‌తో ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంలను తీసుకురావడానికి, స్ట్రాంగురూములోకి తరలించడానికి, అవసరమైన పత్రాలను నింపేందుకు, అందజేసేందుకు వీలుగా కౌంటర్లు ఉండాలన్నారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా రెండు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని, ఎక్కడా ట్రాఫిక్ జామ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో స్పెషల్ కౌంటర్లు, ఆర్‌ఓ టేబుల్, హెల్ప్ డెస్క్, స్క్రూటినీ, మైక్రో అబ్జర్వర్స్ కోసం కూడా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. మంచిగా భోజన సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. సిబ్బంది ఈవీఎంలతో లోపలికి వచ్చిన దగ్గరనుంచి, తమకు కేటాయించబడ్డ కౌంటర్లకు సులువుగా చేరుకొనేవిధంగా, గుర్తించే విధంగా నేమ్ బోర్డులు, డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని ప్రతీచోటా కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూములను సిద్ధం చేయాలని, పనులు వెంటనే మొదలు పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, ఆయా కేంద్రాల నోడల్ అధికారులైన మెప్మా పీడీ ఎం.సుధాకరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డీఎస్‌ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డీఎం మీనాకుమారి, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డికే ఓటేస్తా..


తన మనసులో మాటను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎదుట వెల్లడిస్తున్న టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాపా లక్ష్మణరావు

రాజాం/సంతకవిటి: నేను ఇంతవరకూ ఎన్నో పార్టీలు, ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాను. ఎంతమంది ఒత్తిడిచేసినా ఇప్పటివరకూ తెలుగుదేశం పార్టీని వీడలేదు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి లాంటి మహాత్ముడి పాలనలో కూడా నా మనసు మారలేదు. కానీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా చేసిన పాలన నన్ను మంత్రముగ్ధున్ని చేసింది. పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించారు. అందులోకి నాలాంటి కరడుకట్టిన టీడీపీ కార్యకర్తకు కూడా రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు వచ్చాయి. నా విషయం పక్కన పెడితే.. అన్నెంపున్నెం తెలియక ఆ క్షణానికి ఎన్నికల్లో చొక్కాలు చించుకుని పరుగెత్తే ఎంతో మంది పేదవాళ్లు తరువాతి కాలంలో రాజకీయ నేతల కక్షసాధింపులో సంక్షేమ పథకాలు అందక అవస్థలు పడిన సందర్భాలు చూశాను. అటువంటి వారికి కూడా జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పార్టీలకు అతీతంగా న్యాయం జరిగింది. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ఏ ఒక్కరు ఫ్యాన్ గుర్తును కాదని ఇతర పార్టీలకు ఓటు వేయరు. నేను గ్రామ స్థాయిలో రాజకీయం జరిగే సమయంలో ఆలోచిస్తానేమో. ఇప్పుడు మాత్రం ఎంతమంది చెప్పినా నా మనస్సును గెలుచుకున్న జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేస్తాను. ఈ దఫా ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డే రాజు. నాలాంటి చాలా మంది అభిప్రాయం ఇదే. మే 13న జరిగే ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపిస్తుందంటూ సంతకవిటి మండలం సురవరం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాపా లక్ష్మణరావు తన మనసులోని భావనను వ్యక్తంచేశారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో తన వద్దకు ఓటు అడిగేందుకు వచ్చిన జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడుల ఎదుట తన మనసులో మాట చెప్పారు.

రుణమాఫీ పేరుతో మాయ!

శృంగవరపుకోట:

వ్యవసాయం దండగంటూ వ్యాఖ్యలు చేసినా.. అందరికీ అన్నంపెట్టే రైతన్నంటే చిన్న చూపుచూసినా.. ఉచిత విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు పెట్టినా.. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తానంటే టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మారు. రుణభారం నుంచి విముక్తి లభిస్తుందని ఆశించారు. చివరికి వారి ఆశలు అడియాసలే అయ్యాయి. చంద్రబాబు నిజస్వరూపం చూపించడంతో రైతన్నలు కుంగిపోయారు. ఐదేళ్లు మదన పడ్డారు. అప్పులకు చక్రవడ్డీలు చెల్లించారు. చాలా మంది రైతులు అప్పుల భారం తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. టీడీపీ హయాంలో ఒకే ఏడాది ఏపీలో 628 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటూ నాటి కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ రాజ్యసభలోనే ప్రకటించారు. బాబు మోసపూరిత పాలనకు 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పారు. అదే చంద్రబాబు మళ్లీ రైతులను ఉద్ధరిస్తానంటూ వ్యాఖ్యలు చేస్తుంటే 'నిన్ను నమ్మం బాబూ' అంటూ నినదిస్తున్నారు. చంద్రబాబు మోసపూరిత పాలనను రచ్చబండలపై చర్చిస్తున్నారు. ఉచిత హామీలిచ్చి మోసంచేసే టీడీపీ నాయకుడిని నమ్మితే నట్టేట మునిగిపోతామంటూ వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో 90వేల మంది రైతులకు చెందిన రూ.114.06 కోట్లు మాఫీ చేయకుండా చంద్రబాబు ఎగ్గొట్టాడని గుర్తుచేసుకుంటున్నారు.

రైతన్నకు దన్నుగా జగనన్న

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నకు అండగా నిలిచారు. వ్యవసాయాన్ని పండగగా మార్చారు. ఊరూరా ఆర్‌బీకేలు ఏర్పాటుచేసి విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు సేవలను అక్కరకు తెచ్చారు. ఏటా వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తూ సాగును ప్రోత్సహించారు. పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద రైతు తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేలా ఏర్పాట్లు చేశారు. విపత్తుల సమయంలో రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. నేడు పొరుగు రాష్ట్రాలు సైతం మన రాష్ట్రంలోని ఆర్‌బీకే వ్యవస్థలను అధ్యయనం చేస్తున్నాయంటే 58 నెలల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో తెచ్చిన విప్లవాత్మక మార్పులే కారణం.

రాజేష్ నామినేషన్‌కు తరలిరండి


రాజాం : సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

- 24న నామినేషన్
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ నామినేషన్ ఈ నెల 24న రాజాంలో వేయనున్నారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని దేవీ - శ్రీదేవీ కల్యాణ మండపంలో నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న విజయనగరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బస్సు యాత్ర జరగనుందని, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రాజాంలో ఈ నెల 24న జరగనున్న రాజేష్ నామినేషన్ కార్యక్రమం కూడా విజయవంతం చేయాలన్నారు. 24న ఉదయం 10 గంటలకే రాజాం చేరుకోవాలని కోరారు. నామినేషన్‌కు వచ్చే వారితో మన విజయం ముందే ఖాయమనేది బయట ప్రపంచానికి తెలిసేలా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, పార్టీ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, గురుగుబెల్లి స్వామినాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, కరణం సుదర్శనరావులు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, జేసీఎస్ కన్వీనర్లు పాలవలస గోపి, కామోదుల శ్రీనివాసరావు, కింజరాపు సురేష్, రాగోలు రమేష్‌నాయుడు, కిమిడి ఉమామహేశ్వరరావులు, ఏఎంసీ మాజీచైర్మన్ సిరిపురపు కుమారస్వామినాయుడు, పెద్ద ఎత్తున పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు వడదెబ్బ

- రోడ్డు పక్కకు ఒరిగిపోయిన బస్సు ● తప్పిన పెనుప్రమాదం


రోడ్డుకు పక్కగా ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు


పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న డ్రైవర్ ఆసిఫ్

భామిని: శ్రీకాకుళం డిపో పల్లె వెలుగు బస్సు భామిని మండలంలోని బాలేరు-దిమ్మిడిజోల గ్రామాల మధ్య ఏబీ రోడ్డు పక్కగా ఒరిగిపోయింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ తీవ్ర వడదెబ్బకు గురై అపస్మారక స్థితికి చేరడంతో నడుస్తున్న బస్సు రోడ్డుపక్కకు ఒరిగిపోయింది. అయితే డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. బత్తిలి నుంచి కొత్తూరు వెళ్తున్న బస్సు దిమ్మిడిజోల దాటిన క్రమంలో డ్రైవర్ ఆసిఫ్‌కు వడదెబ్బ తగిలి కళ్లు తిరుగుతుండంతో ప్రమాదాన్ని గుర్తించి బస్సులోని 18 మంది ప్రయాణికులను కిందికి దింపేశాడు. వెంటనే రోడ్డు పక్కకు బస్సు తీస్తుండగా డ్రైవర్ ఆసిఫ్ అపస్మారక స్థితికి చేరుకోవడంతో బస్సు అదుపు తప్పి తుప్పల్లోకి వెళ్లి ఒరిగిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న డ్రైవర్‌ను కిందికి దించి 108 అంబులెన్స్ రప్పించి భామిని పీహెచ్‌సీకి తరలించగా వైద్య సేవలు అందించడంతో ఆరోగ్యం కుదుట పడింది. బస్సులో నుంచి దించిన ప్రయాణికులను తరువాత వచ్చిన ఆర్టీసీ బస్సులో కండక్టర్ ఎక్కించారు.

మద్యం సీసాల సీజ్

గజపతినగరం: మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన బొత్స చక్రి మద్యం సీసాలను తరలిస్తుండగా గజపతినగరం చంపావతి నది బ్రిడ్జి వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ యు.మహేష్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. బొత్స చక్రి మద్యం వ్యాపారం నిమిత్తం 12 మద్యం సీసాలను గజపతినగరం నుంచి లోగిశ గ్రామానికి తరలిస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను సీజ్ చేసి ఆదివారం రాత్రి కేసును నమోదు చేసినట్లు చెప్పారు.

సజావుగా ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి సంబ ంధించిన పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 14 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 3,669 మంది హాజరుకావాల్సి ఉండగా 502 మంది గైర్హాజరుతో 3,167 మంది మాత్రమే పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ ఎన్.ప్రేమకుమార్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ టి.సన్యాసిరాజు, వివిధ మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ తెలిపారు.

సీఎం సిద్ధం సభ ఏర్పాట్లు పరిశీలన


సభాస్థలి వద్ద నాయకులకు సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న జిల్లాకు తొలిసారి విచ్చేస్తున్న సందర్భంగా విజయనగరం మండలం చెల్లూరు వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ డిప్యూటీ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి బస్సుయాత్రలో భాగంగా జిల్లా కేంద్రం సమీపం చెల్లూరు వద్ద మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, భారీ ఎత్తున ప్రజలు తరలురానున్న నేపథ్యంలో సభా స్థలం వద్ద నిర్వహిస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందు లు తలెత్తకుండా పనులు నిర్వహించాలని నాయకులకు సూచనలు చేశారు.